ఈనాడు
సూర్యాపేట
మంగళవారం అక్టోబరు 8, 2024

అతివలే.. అధికం



సూర్యాపేట పట్టణంలో గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకుంటున్న మహిళలు



భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉంటున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల నుంచి జిల్లాలో అతివల ఓట్ల సంఖ్య పెరుగుతూనే ఉంది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఎన్నికల సంఘం(ఈసీ) ఓటుహక్కు కల్పించేందుకు కసరత్తు చేపట్టింది. జిల్లా అధికారులు కూడా ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నారు. వచ్చే ఏడాది జనవరి వరకు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేసేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. జులైలో ప్రారంభమైన ఆన్‌లైన్ నమోదు జనవరి వరకు కొనసాగనుంది. అప్పటి వరకు యువతీ, యువకులు ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు			
నియోజకవర్గం	పురుషులు	మహిళలు	అధికం(మహిళలు)
సూర్యాపేట	67,007	68,704	1697
తుంగతుర్తి	76,256	76,788	532
కోదాడ	91,581	95,983	4,402
హుజూర్‌నగర్	1,00,698	1,06,164	5,466

12,097 మంది మహిళా ఓటర్లు

సూర్యాపేట జిల్లాలో నాలుగు శాసనసభ నియోజకవర్గాలు ఉన్నాయి. వీటన్నింటిలో కలిపి పురుషుల కంటే మహిళా ఓటర్లు 12,097 మంది అధికంగా ఉన్నారు. జిల్లాలో మొత్తం ఓటర్లు 6,83,181 ఉండగా అందులో పురుషులు 3,35,181, మహిళలు 3,47,639 మంది ఉన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోనే 5,466 మహిళలు అత్యధికంగా ఉండగా, తుంగతుర్తి నియోజకవర్గంలో అత్యల్పంగా 532 మంది మహిళా ఓటర్లు పెరిగాయి.

అసెంబ్లీ ఎన్నికల్లోనూ పైచేయి

గత అసెంబ్లీ ఎన్నికల నుంచి జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా నమోదవుతున్నారు. అప్పుడు కూడా నాలుగు నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు అభ్యర్థుల గెలుపోటముల్లో ప్రభావం చూపారు. ఎన్నికల సంఘం ఈ ఏడాది జనవరి నాటికి 18 ఏళ్లు నిండినవారికి ఓటుహక్కు కల్పించింది. ఓటర్లలో యువతీయువకులు ఎక్కువగా ఉన్నారు. ఏప్రిల్‌లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో వీరంతా ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఆ జాబితాలో కూడా అతివలే అధికంగా ఉన్నారు. జనవరి వరకు ఓటు నమోదుకు అవకాశం ఉండటంతో మహిళా ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

రజకుల సాంఘిక భద్రత చట్టం రూపొందించండి

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం రజక సమాఖ్య పాలకమండలి ఏర్పాటు చేసి, రజకులను ఎస్సీ జాబితాల్లో చేర్చాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాల ధనుంజయ నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ధర్మభిక్షం భవన్‌లో సోమవారం నిర్వహించిన రజక వృత్తిదారుల సమాఖ్య జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రజకుల సాంఘిక భద్రత చట్టం రూపొందించాలని, 50 ఏళ్లు పైబడిన వృత్తిదారులకు నెలకు రూ.ఐదు వేల పింఛన్ ఇవ్వాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నిమ్మల శ్రీనివాస్, చెరుకు సింహాద్రి, యల్లంల యాదగిరి, ఖమ్మంపాటి రాము, చిలక రాజు, శ్రీను, బూర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఇక పాలు పొంగించడమే..!

★ ఉమ్మడి జిల్లాలో పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్లు 5,511

★ రెండు పడకగదుల ఇళ్ల కేటాయింపుపై ప్రభుత్వం కసరత్తు



నల్గొండలో పంపిణీకి సిద్ధంగా ఉన్న రెండు పడకగదుల సముదాయం

ఈనాడు, నల్గొండ: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్మాణం పూర్తి చేసుకొని ప్రస్తుతం వృథాగా ఉన్న రెండు పడకగదుల ఇళ్లను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆవాసానికి సిద్ధంగా ఉన్న 5,511 ఇళ్లను ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పంపిణీ చేయనున్నారు. ఇప్పటికే ఈ నెలాఖరులోపు ప్రతి నియోజకవర్గానికి 3500 ఇళ్లను కేటాయిస్తామని ప్రకటించగా.. ఉమ్మడి జిల్లాలోని 11 నియోజకవర్గాలకు 38,500 ఇళ్లు, నాగార్జునసాగర్‌కు ప్రత్యేకంగా 5 వేల ఇళ్లు ఇస్తామని మంత్రి పొంగులేటి ఇటీవల నెల్లికల్ పర్యటన సందర్భంగా వెల్లడించారు.

★ రెండు పడకగదుల ఇళ్ల స్థితిగతులపై ఇప్పటికే అధికార యంత్రాంగం సమగ్ర నివేదికలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించింది. ఈ నివేదికల ఆధారంగా సర్కారు ఓ నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో మొత్తం 17,199 ఇళ్లు మంజూరు చేయగా నాగార్జునసాగర్, ఆలేరుల్లో మినహాయించి ప్రతి నియోజకవర్గంలో ఈ పథకంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. మొత్తం 6,391 ఇళ్లు నిర్మాణం పూర్తి కాగా..ఇందులో సూర్యాపేట నియోజకవర్గంలో మాత్రమే 880 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు. దేవరకొండ, నల్గొండ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయి మూడేళ్లయింది.



"సాధ్యమైనంత తొందరలో రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారులకు అందించేందుకు కసరత్తు చేస్తున్నాం. అవసరమైతే దసరాలోపే ఇస్తాం. ఇందిరమ్మ ఇళ్లకు సైతం ఈ నెలాఖరులోపు అర్హులను ఎంపిక చేస్తాం.. ఇటీవల సమీక్ష సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేసిన ప్రకటన ఇది..

★ నల్గొండ పురపాలిక పరిధిలో 540 ఇళ్లను నిర్మించగా..అవి లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో అవి రోజురోజుకూ శిథిలావస్థకు చేరుతున్నాయి. యాదాద్రి జిల్లాలో 829 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా.. ఇప్పటి వరకు ఒక్క ఇంటినీ లబ్ధిదారులకు కేటాయించలేదు. సరైన సమయంలో బిల్లులు రాకపోవడం, గుత్తేదారులు పనులు చేయడానికి ఆసక్తి చూపకపోవడం తదితర కారణాలతో నకిరేకల్, మిర్యాలగూడ, తిప్పర్తి లాంటి ప్రాంతాల్లో నిర్మాణాలు 50, 60 శాతం పూర్తయి నిలిచిపోయాయి.

ఇందిరమ్మ కమిటీల ద్వారానే..

ప్రతి నియోజకవర్గానికి కేటాయించే 3500 ఇళ్లకు అర్హులను గ్రామాల్లోని ఇందిరమ్మ కమిటీల ద్వారానే ఎంపిక చేయాలని సర్కారు ఇప్పటికే నిర్ణయించింది. ఇందిరమ్మ కమిటీలను దసరాలోపు నియమిస్తారా? లేదా అనంతరమా? అన్నది తేలాల్సి ఉంది.

★ గతేడాది రెండు పడక గదుల ఇళ్లకు లబ్ధిదారులను డ్రా పద్ధతిలో కేటాయించగా...ఇప్పుడు వారికే అప్పగిస్తారా లేదా అన్నదీ ఇంకా సందిగ్ధంలోనే ఉంది. ఈ ఏడాది జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో ప్రస్తుతం నిర్వహిస్తున్న ప్రజావాణిల్లోనూ ఎక్కువ దరఖాస్తులు ఇళ్లు కావాలనే వస్తుండటం గమనార్హం. ప్రభుత్వం ఏర్పడిన కొత్తలో నిర్వహించిన ప్రజాపాలన దరఖాస్తుల్లోనూ ఇవే అత్యధికంగా ఉన్నాయి. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ దసరాలోపు ఓ నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమవుతుండటంతో అర్హుల్లో ఆశలు మొదలయ్యాయి.

గణాంకాలు				
జిల్లా	మంజూరైన ఇళ్లు	పూర్తయినవి	50 శాతం కంటే ఎక్కువ నిర్మాణమైనవి	లబ్ధిదారులకు అందజేసినవి
నల్గొండ	8155	2476	3542	185
సూర్యాపేట	5424	3086	1986	695
యాదాద్రి	3620	829	1270	0

ఉద్యోగులందరికీ బయోమెట్రిక్ తప్పనిసరి: కలెక్టర్



సూర్యాపేట: ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, ఎక్కువ రోజులు పెండింగ్ ఉంచకుండా కచ్చితమైన సమాధానం చెప్పాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ స్పష్టంచేశారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు. ఉద్యోగులందరికీ బయోమెట్రిక్ విధానం ద్వారానే హాజరు నమోదు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది బయోమెట్రిక్ నమోదు చేయకపోతే జిల్లా అధికారులు పూర్తి బాధ్యత వహించాలన్నారు. మండలానికి కేటాయించిన ప్రత్యేక అధికారులు తమ మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ నివేదికలు సమర్పించాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 59 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీవో అప్పారావు, ఇన్‌ఛార్జి డీపీవో నారాయణరెడ్డి, డీఏవో శ్రీధర్‌రెడ్డి, డీఎంహెచ్‌వో కోటాచలం, డీటీడీవో శంకర్, పరిపాలన అధికారి సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతేరాజు 8లో..

మహాలక్ష్మీదేవిగా అలంకరించి.. నైవేద్యాలు సమర్పించి



తుంగతుర్తిలో మహాలక్ష్మీదేవిగా అలంకరించిన దుర్గామాతకు హారతి నివేదిస్తున్న మహిళలు

దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా సోమవారం తుంగతుర్తిలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన భక్తులు 43 రకాల వంటకాలను నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. – తుంగతుర్తి, న్యూస్‌టుడే:

అన్నపూర్ణదేవిగా అమ్మవారు



బూరుగడ్డ గ్రామంలోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణ దేవిగా సోమవారం దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. -హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే:

దాబాల్లో మద్యం.. పట్టించుకోని వైనం



"కోదాడ పట్టణంలో సుమారు 10 దాబాలు ఉండగా.. ప్రతి దాంట్లో విచ్చలవిడిగా మద్యం విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. రాత్రి 12 గంటల వరకు మందుబాబుల హడావుడి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రధాన రహదారుల వెంబడి ఉన్న దాబాల్లో ఇదే పరిస్థితి.

"ఇటీవల కోదాడ నియోజకవర్గంలోని చిలుకూరు మండల పరిధిలో ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. పని నిమిత్తం కోదాడకు వచ్చి వెళ్లే సమయంలో పట్టణంలోని ఓ దాబాలో మద్యం తాగారని స్థానికులు చెబుతున్నారు.

"గతేడాది కోదాడ పట్టణంలోని రెండు దాబాల నిర్వాహకులు మద్యం తాగి అర్ధరాత్రి 12 గంటల సమయంలో కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి. కొద్ది రోజుల పాటు పోలీసులు దాబాల్లో మద్యం విక్రయించకుండా చర్యలు తీసుకొని, వదిలేశారు. దీంతో ఎప్పటిలాగే మద్యం జోరు దాబాల్లో కొనసాగుతోంది.

కోదాడ, న్యూస్‌టుడే: ఆహారశాలల్లో భోజనం చేయడానికి వెళ్తుంటాం. పని నిమిత్తం బయటకు వెళ్లినప్పుడు, సెలవు రోజుల్లో ఆటవిడుపు కోసం కుటుంబీకులతో కలిసి కొందరు అప్పుడప్పుడు దాబాలకు వెళ్తుంటారు. ప్రశాంత వాతావరణంలో భోజనం చేయాల్సిన చోట మందుబాబుల హడావుడి చూసి ఇబ్బందులు పడుతున్నారు. దాబాల నిర్వాహకులు ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా ఆహారశాలల్లో మద్యం ప్రియులకు ఆశ్రయం కల్పిస్తున్నారు. ప్రభుత్వం మద్యానికి ఇచ్చిన పర్మిట్ రూమ్‌లకు అదనంగా దాబాల్లో మద్యం విక్రయాలు ఉన్నాయి. గత ఏడాది కాలంలో ఆహార శాలలో మద్యం అమ్మకాలపై కేసులు నమోదు కాకపోవడం గమనార్హం.

జోరుగా విక్రయాలు..

కోదాడలో జాతీయ రహదారిని ఆనుకొని దాబాలు ఉండగా వాటిలో మద్యం సిటింగ్‌లకు అనుమతి ఉండటంతో కొందరు అతిగా తాగి డ్రైవింగ్ చేసి ప్రమాదాలకు కారణమవుతున్నారు. హుజూర్‌నగర్, సూర్యాపేట, నల్గొండ, భువనగిరి, నకిరేకల్, తదితర ప్రాంతాల్లో రహదారుల వెంబడి పదుల సంఖ్యలో దాబాలు వెలిశాయి. దూరపు ప్రయాణాలు చేసే కారు, లారీ డ్రైవర్లతో పాటు, స్థానికులు మద్యం తాగి నడుపుతూ ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు.

బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం:

లక్ష్మానాయక్, ఎక్సైజ్ ఎస్పీ, సూర్యాపేట

ఆహారశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా మందుబాబులకు ఆశ్రయం కల్పిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. దీనిపై నిఘా పెంచి త్వరలోనే చర్యలు తీసుకుంటాం. మద్యం సిటింగ్‌లను ఏర్పాటు చేసిన దాబాలను సీజ్ చేసి, బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం.

పేట పుర సిబ్బంది పనితీరుకు ప్రశంసలు



సూర్యాపేట పుర సిబ్బంది తయారు చేసిన మ్యాట్లను ప్రదర్శిస్తున్న ఐఎస్‌జీ ఛైర్మన్ డాక్టర్ కె.మృత్యుంజయ, విజయలక్ష్మి, డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, జి.సురేష్, తదితరులు

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే: సూర్యాపేట పురపాలిక సిబ్బంది చేస్తున్న పర్యావరణ హిత పనులకు ప్రశంసలు లభించాయి. సిబ్బంది ప్లాస్టిక్‌తో తయారు చేస్తున్న ఇటుకలు, టైల్స్, ఆక్యుప్రెషర్ మ్యాట్లు హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో జరుగుతున్న ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎన్విరాన్‌మెంటు మేనేజ్‌మెంటు సదస్సులో సోమవారం ప్రదర్శించారు. వాటిని చూసిన ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమాటిక్స్(ఐఎస్‌జీ) ఛైర్మన్ డాక్టర్ కె. మృత్యుంజయ ప్రశంసించారు. సూర్యాపేట పురపాలికలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో అద్భుతమైన ప్రయోగం చేయడం హర్షణీయమన్నారు. ఆర్ఆర్ఆర్(రెడ్యూస్, రీయూజ్, రీసైకిలింగ్)ను అమలు పర్చటం శుభపరిణామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌జీ కార్యదర్శులు విజయలక్ష్మి, డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, సింగరేణి అడిషనల్ మేనేజర్ జి. సురేష్, సూర్యాపేట పర్యావరణ ఇంజినీర్ శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

స్తంభానికి కర్రలే ఊతం

మండల కేంద్రం నుంచి బేతవోలుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న పొలాలలో ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ స్తంభం ఒరిగింది. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. చేసేదేమీ లేక కర్రలను ఊతంగా పెట్టారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ సైదయ్యను వివరణ కోరగా సమస్య తన దృష్టికి రాలేదని, పరిశీలించి తక్షణమే పరిష్కరిస్తానన్నారు. - చిలుకూరు, న్యూస్‌టుడే



మృత్యువులా దూసుకొచ్చిన కారు

★ ఇంటికి కూతవేటు దూరంలో యువకుడి దుర్మరణం



సందీప్

చివ్వెంల, న్యూస్‌టుడే: యూటర్న్ దాటితే.. ఒక్క నిమిషంలోనే ఇంటికి చేరుకునేవారు. కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపేవారు. అంతలోనే కారు మృత్యువులా దూసుకొచ్చింది. యువకుడిని ఢీకొట్టి అతని మరణానికి కారణమైంది. ఈ విషాద సంఘటన చివ్వెంల మండలంలోని గుంపుల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంపుల గ్రామానికి చెందిన మట్టపల్లి శ్రీనివాస్ యాదవ్‌కు ఇద్దరు కుమారులు సంతానం. శ్రీనివాస్ యాదవ్ అనారోగ్యానికి గురవడంతో మూడు రోజులుగా పెద్దకుమారుడు మట్టపల్లి సందీప్ (23) సూర్యాపేటలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించి ఇంటికి తీసుకొస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం కూడా తండ్రిని దవాఖానాకు తీసుకెళ్లారు. మందులు కొనుగోలు చేయడానికి తండ్రి అక్కడే ఉండి పోగా.. సందీప్ ఒక్కడే ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరారు. సొంత గ్రామానికి చేరుకున్న ఆయన కొద్దిదూరంలో ఉన్న ఇంటికి వెళ్లడానికి హైదరాబాద్-విజయవాడ-65వ జాతీయ రహదారిపై యూటర్న్ తీసుకుంటున్నారు. ఇంతలో సూర్యాపేట వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఎగిరి కిందపడిన సందీప్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. కొన ఊపిరితో అతన్ని స్థానికులు జిల్లాకేంద్రంలోని ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చేతికందిన కుమారుడికి పెళ్లి చేయాలని ఆశలు పెట్టుకున్న తల్లిదండ్రులు విగత జీవిగా మారిన అతన్ని చూసి గుండెలవిసేలా రోదించడం స్థానికులను కలచివేసింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.వెంకట్‌రెడ్డి తెలిపారు.

నిల్వ ఉంచిన బియ్యం పట్టివేత

చివ్వెంల, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం సమీపంలోని దురాజ్‌పల్లి శివారులో ఓ దాబాలో పెద్ద ఎత్తున నిల్వ ఉన్న బియ్యాన్ని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. ఎస్సై బి.వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండలం కోటినాయక్‌తండాకు చెందిన శేషులాల్ సుమారు 30 టన్నుల బియ్యం సేకరించి దురాజ్‌పల్లి వద్దనున్న దాబాలో నిల్వ ఉంచాడు. పౌర సరఫరాల శాఖ డీటీ నాగలక్ష్మి బియ్యాన్ని పరిశీలించి పీడీఎస్‌కు చెందినవి కావని ప్రాథమికంగా తేల్చిచెప్పారు. పార్‌బాయిల్డ్ మిల్లుల్లోంచి తీసేసిన (రిజెక్టెడ్) బియ్యమని పేర్కొన్నారు. అందులో పీడీఎస్ బియ్యం కలిపి ఉంటారనే అనుమానాలు వ్యక్తం కావడంతో నిర్ధారించేందుకు నమూనాలను హైదరాబాద్‌కు పంపించినట్లు ఎస్సై తెలిపారు. నిల్వ ఉంచిన బియ్యంతో పాటు అక్కడ ఉన్న డీసీఎం వాహనాన్ని తమ ఆధీనంలోకి తీసుకున్నట్లు చెప్పారు.



దురాజ్‌పల్లి శివారులో దాబాలో దాచిన బియ్యం

ధాన్యం ఉందా.. ధనమై పోయిందా..!



హుజూర్‌నగర్: ఓ మిల్లులో ఉన్న సీఎంఆర్ ధాన్యం

❒ సీఎంఆర్ బియ్యం పెట్టని మిల్లుల్లో తనిఖీలు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) బకాయి ఉన్న మిల్లుల్లో అధికారుల తనిఖీ మొదలయ్యాయి. వారు ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యానికి సరిపడా మిల్లుల్లో ధాన్యం ఉందా, లేదా అన్న విషయంపై అధికారులతో తనిఖీ చేయించేందుకు ఎఫ్‌సీఐ నిర్ణయించింది. ఈ నెల పదిలోగా లెక్కలు తేల్చాలని ఎఫ్‌సీఐ నిర్ణయించి తనిఖీలు ప్రారంభించింది. ఈ మేరకు ఈ నెల 5న ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేసేందుకు ఏడుగురు ప్రత్యేక అధికారులను నియమించి వారి ద్వారా ఆయా మిల్లుల్లో ధాన్యం నిల్వల లెక్కలు తేల్చనున్నారు. లెక్కలు తేలిన తరువాతే సీఎంఆర్ బియ్యం సేకరణలు తిరిగి ప్రారంభించాలని ప్రాథమికంగా ఎఫ్‌సీఐ నిర్ణయించింది.

★ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడుగురు అధికారులను నియమించారు. చిట్యాల, నకిరేకల్‌కు ఒకరిని, నల్గొండ, దేవరకొండకు మరొకరిని నియమించారు. హాలియా, మిర్యాలగూడ కేంద్రాలకు ఒకరిని, హుజూర్‌నగర్, నేరేడుచర్ల కేంద్రాలకు ఒక అధికారిని నియమించారు. కోదాడకు ప్రత్యేకంగా ఒకరిని నియమించారు. సూర్యాపేట, తిరుమలగిరి కేంద్రాలకు ఒక అధికారిని, యాదాద్రి, భువనగిరి ప్రాంతాలకు ఒకరిని నియమించారు. ఈ ఏడుగురు అధికారుల ఆధ్వర్యంలో సీఎంఆర్ బకాయిలు ఉన్న మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి రావాల్సిన బియ్యానికి సంబంధించి అసలు ధాన్యం ఉందా లేదా అన్న విషయంపై యుద్ధ ప్రాతిపదికన నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

చర్యలు తీసుకునే అవకాశం..

ఎన్ని సార్లు గడువు పెంచినా మిల్లర్లు సీఎంఆర్ బకాయిలు ఇవ్వడం లేదు. ఇప్పటికే కొంత మంది మిల్లర్లు ఉన్న ధాన్యం అమ్ముకొని దాటవేత ధోరణితో ఉన్నారని అధికారులు గుర్తించారు. సీఎంఆర్ ధాన్యం మిల్లుల్లో ఏ స్థాయిలో ఉందో తనిఖీలలో ఈసారి కచ్చితంగా లెక్కలు తేలుతాయన్న నమ్మకంతో అధికారులు ఉన్నారు. గతంలోనూ మిల్లుల్లో లెక్కలు తేల్చాలని నిర్ణయించినా తమ మిల్లుల్లో ధాన్యం లెక్కించే విధంగా లేదని, రకరకాల కారణాలు చెప్పి దాటవేశారు. ఈసారి అలా జరగకుండా ఎలా ఉన్నా ధాన్యాన్ని అధికారులు లెక్కించి ఒక నిర్ణయానికి రావాలని ఆదేశించినట్లు సమాచారం. ఈసారి మిల్లుల్లో ధాన్యం లేని మిల్లర్లపై చర్యలు తీసుకునే అవకాశం కూడా ఉందని అధికార వర్గాలు అంటున్నాయి.

2023-24 వానాకాలం, యాసంగి సీఎంఆర్ వసూలు వివరాలు 21-09-2024 నాటికి (మె.టన్నుల్లో)

జిల్లా	వసూలైన బియ్యం	బకాయిలు
వానాకాలం:		
నల్గొండ	1,89,215	28,361
సూర్యాపేట	75,590	64,564
యాదాద్రి	1,38,848	40,039
యాసంగి:		
నల్గొండ	1,39,613	82,113
సూర్యాపేట	40,604	1,22,989
యాదాద్రి	68,721	1,15,333

సాగులో సాంకేతిక సాయం

రైతేరాజు



త్రిపురారం మండలం బాబుసాయిపేటలో డ్రోన్‌తో మందులు పిచికారీ చేయిస్తున్న రైతు

త్రిపురారం, న్యూస్‌టుడే: వ్యవసాయంలో యాంత్రీకరణ రోజురోజుకు పెరుగుతుంది. అందులో కూలీల కొరత, వారికున్న డిమాండ్, ఖర్చులు విపరీతంగా పెరుగుతుండడంతో గమనించిన నల్గొండ జిల్లా త్రిపురారం మండలం బాబుసాయిపేట గ్రామానికి చెందిన గోపగాని హరిప్రసాద్, శివనారాయణలు రూ.5.20 లక్షల వ్యయంతో బ్యాటరీతో నడిచే డ్రోన్‌ను కొనుగోలు చేసి పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. డ్రోన్‌తో ఎకరం పొలంలో 5 నుంచి 10 నిమిషాలలోపు మందులను పిచికారీ చేయవచ్చు. దీని వల్ల రైతులకు సమయం ఆదాతో పాటు, ఖర్చులు తగ్గుతాయి. దీంతో పరిసర గ్రామాల రైతులు డ్రోన్ ద్వారా పురుగు మందులు, ఎరువులు చల్లడానికి ఆసక్తి కనబర్చుతున్నారు. కంపసాగర్ కేవీకే వారు సైతం రైతులు ముందుగా సమాచారం ఇస్తే డ్రోన్ల ద్వారా పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు.

ఖర్చు తగ్గుతుంది

– గోపగాని చిననర్సయ్య, త్రిపురారం



ప్రస్తుతం ట్రాక్టర్ సాయంతో పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. దీని వల్ల ఎకరాకు రూ.800 వరకు ఖర్చు కాగా యంత్రంతో రూ.400 నుంచి రూ.500 తోనే అయిపోతుంది. ఈ విధానం వల్ల మందు వృథా కాదు. కూలీల కొరతను అధిగమించవచ్చు.

ఎత్తు మడుల పద్ధతిలో వేరుసెనగ

గరిడేపల్లి, న్యూస్‌టుడే: వేరుసెనగ సాగుచేసే రైతులు ఎత్తుమడుల పద్ధతిలో విత్తుకోవచ్చని కేవీకే శాస్త్రవేత్త అరిగేల కిరణ్ సూచించారు.



వేరుసెనగను విత్తుకోవడానికి ఇదే సరైన సమయం. నవంబరు పక్షం వరకు వేసుకోవచ్చు. కాండం కుళ్లు తెగులు ఆశించకుండా ముందస్తుగా విత్తనశుద్ధి చేసుకోవాలి. కొత్తగా సాగుచేసే రైతులు ఎకరానికి సరిపడా విత్తనానికి 250 గ్రాముల రైజోబియం అనే జీవన ఎరువుతో విత్తన శుద్ధిచేయాలి. కొత్తగా ఎత్తు మడుల పద్ధతిలో విత్తుకుంటే కాయలు ఎక్కువగా వచ్చి అధిక దిగుబడులు సాధించవచ్చు. 120 సెం.మీ. ఎడంగల 15 సెం.మీ. ఎత్తుమడులు 30 సెం.మీ. ఉండే కాల్వలు ఏర్పాటు చేసుకోవాలి. ప్రతి మడి మీద 30 సెం.మీ. దూరంలో నాలుగు వరుసల్లో వేరుసెనగ విత్తుకోవాలి. లేదంటే ట్రాక్టర్‌తో నడిచే బ్రాడ్ బెడ్ ప్లాంటర్‌తో విత్తుకోవచ్చు.

సౌరశక్తితో.. సర్వ ప్రయోజనాలు

చందంపేట, న్యూస్‌టుడే: పంటలను కాపాడుకునేందుకు రైతులు విభిన్న ప్రయత్నాలు చేస్తున్నా.. చివరికీ దిగుబడి మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ఈ క్రమంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందేందుకు కొందరు రైతులు సాంకేతిక పరికరాలను ఉపయోగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. బుడ్డోనితండాకు చెందిన రైతు బాలు ఇటీవల నల్గొండ నాగార్జున డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రదర్శనకు హాజరయ్యాడు. పత్తి పంటలకు సోకే తెల్ల, పచ్చదోమ, వివిధ రకాల పురుగుల నుంచి కాపాడుకునేందుకు రూ.4500 వ్యయంతో సోలార్ ట్రాప్స్‌ను కొనుగోలు చేశాడు. ఈ పరికరం రెండెకరాల వరకు పంటను నాశనం చేసే పురుగులను నివారిస్తుందని తెలిపారు. హాని చేసే పురుగులు సాయంత్రం 8 నుంచి 12 గంటల వరకు, ఉదయం 6 నుంచి 7 గంటల వరకు సంచరిస్తాయి. ఆ సమయంలో సోలార్ ట్రాప్‌కు అమర్చిన గిన్నెలో వెలుతురుకు పురుగులు వచ్చి అందులో పడి చనిపోతాయి. మిగతా సమయంలో సోలార్ ట్రాప్ వెలుగులు దానంతట అవే ఆగిపోతాయి. ఈ పరికరంతో పంటకు పిచికారీ చేసే అవకాశం కొద్దిగా తగ్గుతుందని రైతు పేర్కొన్నారు.



బుడ్డోనితండా సమీపంలో పొలంలో ఏర్పాటు చేసిన సోలార్ ట్రాప్

పత్తిలో పూత, కాయ రాలడం నివారణ

త్రిపురారం: పత్తిలో అధిక వర్షాల కారణంగా పూత, కాయ రాలడం దాని నివారణపై కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాస్‌రావు తెలియజేశారు. పత్తిలో ప్రతికూల పరిస్థితుల వల్ల మొక్కల జీవన ప్రక్రియలో మార్పు వల్ల, అధిక వర్షాల వల్ల పూత, పిందె రాలడం జరుగుతుంది. అధిగమించడానికి నాప్తలిన్, ఎసిటిక్ యాసిడ్ 10 పీపీఎమ్ ద్రావణాన్ని విడిగా, 1 మి.లీ. డైఅమ్మోనియం ఫాస్ఫేట్ ద్రావణంతో కలిపి ఒకటి, రెండు సార్లు 10, 15 రోజుల వ్యవధిలో అవసరాన్ని బట్టి పిచికారీ చేయాలి. సైకోసిల్ 60 పీపీఎమ్ పిచికారీ చేయడం ద్వారా కూడా పూత, పిందె రాలడాన్ని అధిగమించవచ్చు.



కాయ కుళ్లు తెగులు లక్షణాలు కాయలపై పెద్ద వ్యాప్తి చెందిన మచ్చలు ఏర్పడతాయి. మచ్చల మధ్యలో గులాబీ రంగులో ఉండే స్పోర్‌మాస్ ఉంటుంది. పత్తి మొక్క అన్ని భాగాలను, పెరుగుదల యొక్క ఏదైనా దశలోనైనా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. వ్యాధి ఎక్కువగా ఉన్నప్పుడు కాయలు కుళ్లి పోతాయి. దీని నివారణకు స్ట్రెప్రొసైక్లిన్ 1 మి.లీ., కాపర్ ఆక్సీక్లోరైడ్ మందులను 30 గ్రా. 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి.

సమస్య - సమాధానం

? యాసంగిలో వేరుసెనగ విత్తే సమయం తెలపగలరు. -కృష్ణయ్య, నల్గొండ

సమాధానం: తెలంగాణ ప్రాంతంలో సెప్టెంబరు మొదటి పక్షం నుంచి నవంబరు 30 వరకు విత్తుకోవచ్చు. అనుకూలమైన విత్తే రకాలు కదిరి- 6, 9 అనంత, ధరణి టీవీజీ-24, జేఎల్- 24, జేసీసీ-110 వేరుసెనగను అక్టోబరు 15 లోపు విత్తడం ద్వారా పురుగుల, చీడ పీడల ఉద్ధృతి నివారించవచ్చు.

? ఆయిల్ పామ్‌లో కొమ్ము పురుగు లక్షణాలు, నివారణ చర్యలు తెలపండి. -బాలునాయక్, దేవరకొండ

సమాధానం: ఆకుల చివర ఏ ఆకారంలో ఖాళీలు ఏర్పడతాయి. ఆకుల మొదళ్ల మీద శాశ్వత రంధ్రాలు ఏర్పడి వాటి నుంచి పిప్పి బయటకు కనిపిస్తుంది. నివారణకు పునరుత్పత్తి ప్రదేశాలను నాశనం చేయాలి. సూది మొనగల ఇనుప ఊచను మొవ్వ వద్ద కన్నంలో దూర్చి లోపల పెంకు పురుగులను బయటకు తీసి చంపాలి. పులిసిన ఆముదపు పిండి, లింగాకర్షక ఎరల ద్వారా పెద్ద పురుగులను పట్టి చంపవచ్చు.

? యాసంగిలో అనువైన వరి రకాలు, విత్తే సమయం గురించి తెలపగలరు. -శ్రీనివాస్‌రెడ్డి, తిప్పర్తి

సమాధానం: డిసెంబరు నుంచి ఏప్రిల్ వరకు వరి పంటను రైతాంగం సాగు చేస్తుంటారు. యాసంగిలో అనువైన రకాలు శోభిని ఆర్ఎన్ఆర్-2354, రాజేంద్ర ఆర్ఎన్ఆర్-12329, జేజీఎల్- 1118, ఎర్రమల్లెలు, డబ్ల్యూజీఎల్-20471. జనవరి మొదటి వారంలో నాట్లను వేసుకోవాలి.

త్రిపురారం, న్యూస్‌టుడే:

రైతులు వాట్సప్ ద్వారా అడిగే సమస్యలకు, సందేహాలకు కంపసాగర్ కేవీకే ఉద్యాన విభాగం శాస్త్రవేత్త శ్రీనివాసరావు సమాధానాలు ఇస్తారు. ఫోన్ నంబర్: 77025 44771



కంపసాగర్ కేవీకే పీసీ శ్రీనివాసరావు

బడిపిల్లలే భూసారథులు



భూసార పరీక్ష కిట్ గురించి వివరిస్తున్న వ్యవసాయాధికారులు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సాగులో విచ్చలవిడిగా రసాయన ఎరువులు వాడటంతో భూసారం దెబ్బతింటోంది. దీనిపై అన్నదాతలకు అవగాహన కలిగిస్తే జరుగుతున్న నష్టాన్ని నివారించవచ్చు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎక్కువ శాతం రైతు కుటుంబాల నుంచి వచ్చినవారే. వారికే నేల ఆరోగ్యం, పంటల సాగు, రసాయన ఎరువుల వినియోగంపై అవగాహన కల్పిస్తే.. వారి ద్వారా రైతు కుటుంబాలకు మేలు జరుగుతుంది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా ఈ విద్యా సంవత్సరంలో స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం ప్రాజెక్టును చేపట్టింది. దేశవ్యాప్తంగా వెయ్యి పాఠశాలలను ఎంపిక చేసింది. ఇందులో నల్గొండ జిల్లాలో రెండు, యాదాద్రి భువనగిరి జిల్లాలో ఒక పాఠశాలలో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నారు. పాఠాలు వినే బడి పిల్లలే స్వయంగా రైతు భూముల నుంచి మట్టి నమూనాలు సేకరిస్తున్నారు. వాటి ఫలితాలను రైతులకు అందజేస్తారు. ఏ ఎరువు, ఎంత మోతాదులో వేయాలో వ్యవసాయాధికారులు వారికి శిక్షణ ఇస్తారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు పాఠాలు..

ప్రాజెక్టు కోసం ఎంపిక చేసిన పాఠశాలల్లో ఆసక్తి ఉన్న విద్యార్థుల పేర్లతో ప్రత్యేకంగా పోర్టల్ ఏర్పాటు చేసుకొని అందులో నమోదు చేయాలి. మట్టి నమూనాల సేకరణ, రికార్డుల నిర్వహణ, ఫలితాల విశ్లేషణ, ఫలితాలను ఆన్‌లైన్ చేయాల్సి ఉంటుంది. 7, 8, 9, 10 తరగతులకు చెందిన విద్యార్థుల్లో 50 మందిని ఎంపిక చేసుకొని, నాలుగైదు బృందాలుగా ఏర్పాటు చేసుకోవాలి. మట్టి నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణ, తదితర వాటి గురించి విద్యార్థులకు స్థానిక భూసార పరీక్ష కేంద్రం అధికారులు శిక్షణ ఇస్తారు. మట్టి నమూనాల నుంచి ఫలితాల వరకు విద్యార్థులు స్వయంగా పని చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే ఆయా పాఠశాలల్లో శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశారు. ఎంపిక చేసిన పాఠశాలలకు ప్రభుత్వం భూసార పరీక్ష కిట్‌ను సరఫరా చేసింది. పాఠశాలకు దగ్గరలో ఉండే పంట పొలాల నుంచి వానాకాలం, యాసంగి కలిపి 50 నమూనాలు సేకరించి, వాటిని పరీక్షించి, ఫలితాలు రైతులకు అందించాల్సి ఉంటుంది.

ఎంపిక చేసిన పాఠశాలలు ఇవే..

నల్గొండ జిల్లాలో స్థానిక కేంద్రీయ విద్యాలయంతో పాటు చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయం ఎంపిక చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో రాయగిరి జడ్పీ ఉన్నత పాఠశాల ఎంపిక చేయగా.. సూర్యాపేట జిల్లాలో భూసార పరీక్ష కేంద్రం లేకపోవడంతో పాఠశాలలను ఎంపిక చేయలేదు.

రైతులకు ఉపయోగం..

లోహిత, కేంద్రీయ విద్యాలయం, నల్గొండ



భూసార పరీక్షల ద్వారా రైతులకు ప్రయోజనం ఉంటుంది. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా ఎరువులు వేస్తే ఖర్చు తగ్గుతుంది. అనవసరంగా ఎరువులు వేయడం తప్పుతుంది. అధిక దిగుబడులు సాధించవచ్చు. దీనిపై రైతులను చైతన్యం చేస్తాం.

ఎప్పటికప్పుడు సందేహాల నివృత్తి

పాల్యాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

ప్రాజెక్టులో భాగంగా ఎంపిక చేసిన పాఠశాలల్లో మట్టి నమూనాల సేకరణ, ఫలితాల విశ్లేషణ తదితర వాటిపై శిక్షణ ఇచ్చాం. పాఠశాలల వారీగా కిట్లు సరఫరా చేశాం. విద్యార్థులకు సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నాం.

భారాస నాయకులు నివాసం ఉంటే తెలుస్తుంది: మంత్రి

దేవరకొండ, న్యూస్‌టుడే: అసెంబ్లీ సమావేశాలకు రాని కేసీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు ప్రతిపక్ష హోదాలో బాధ్యతగా వ్యవహరిస్తున్నారా.. అని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. నల్గొండ జిల్లా దేవరకొండ పురపాలికలోని స్థానిక ఫంక్షన్‌హాల్‌లో సోమవారం మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆయన



దేవరకొండలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు జైవీర్ రెడ్డి, బాలు నాయక్, తదితరులు

ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2014లో ప్రస్తుత ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌ను ఓడించేందుకు దేవరకొండకు వచ్చిన కేసీఆర్ నక్కలగండి ప్రాజెక్టును కుర్చీ వేసుకొని పూర్తి చేస్తానని చెప్పి, నేడు ఫాంహౌస్ నుంచి బయటకు రావడం లేదని ఆరోపించారు. మూసీ వల్ల అనేక మంది రోగాల బారిన పడుతున్నారని.. వారిని రక్షించేందుకు తమ ప్రభుత్వం మూసీ ప్రక్షాళనకు చర్యలు చేపడుతుంటే హరీశ్‌రావు, కేటీఆర్ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. భారాస నాయకులు అక్కడ నివాసం ఉంటే అక్కడి కష్టాలు తెలుస్తాయన్నారు. దేవరకొండ, నాగార్జునసాగర్ ఎమ్మెల్యేలు నేనావత్ బాలునాయక్, కుందూరు జైవీర్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, పురపాలిక సంఘం ఛైర్మన్ ఆలంపల్లి నర్సింహ, జూలూరు ధనలక్ష్మి, ప్రతాప్‌రెడ్డి తదితరులున్నారు.

నార్మల్ డెయిరీకి పూర్వవైభవం తెస్తాం..

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హయత్‌నగర్, న్యూస్‌టుడే: నల్గొండ-రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార యూనియన్ (నార్మల్ డెయిరీ)కు పూర్వవైభవం తెచ్చేందుకు శక్తివంచన లేకుండా కృషిచేస్తానని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హయత్‌నగర్‌లోని డెయిరీ కార్యాలయంలో నూతన ఛైర్మన్‌గా ఎన్నికైన గుడిపాటి మధుసూదన్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అతిథులుగా ముఖ్య అతిథులుగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ ఛైర్‌పర్సన్ పండుగల జయశ్రీ, డీసీసీ ఛైర్మన్ సంజీవరెడ్డి తదితరులు హాజరయ్యారు. మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. డెయిరీ లాభాలబాట పట్టించేందుకు అన్నిరకాల చర్యలు చేపడతామన్నారు. ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి జిల్లాలో విజయ డెయిరీకి బదులుగా ప్రభుత్వ ఆస్పత్రులు, వసతిగృహాలు, ఆలయాల్లో నార్మల్ డెయిరీ పాలు, నెయ్యి వినియోగించేలా చూస్తామన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, మంత్రి వెంకట్‌రెడ్డి

అట్టహాసంగా అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ అథ్లెటిక్స్ సంఘం సహకారంతో హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో 10వ రాష్ట్రస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో రెండు రోజులపాటు జరిగే పోటీలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి అథ్లెట్లు హాజరయ్యారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేషీ, స్పోర్ట్స్ ఓఎస్డీ రవీందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మొదట రాష్ట్రస్థాయి పోటీలు హైదరాబాద్‌లో నిర్వహిస్తే బాగుండు అనుకున్నా.. కానీ! ఇక్కడి జేఎన్ స్టేడియంలో సింథటిక్ ట్రాక్ చూసిన తర్వాత సంతోషం కలిగిందన్నారు. రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఛైర్మన్ వరద రాజేశ్వరరావు మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా ఓరుగల్లులో క్రీడాకారులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. జేఎన్ స్టేడియంలో మౌలిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తానని హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి అశోక్‌కుమార్ తెలిపారు. గత నెలలో చెన్నైలో జరిగిన సౌత్ ఏషియన్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్(ఎస్ఏఏఎఫ్) గేమ్స్‌లో వరంగల్ జిల్లా నెక్కొండకు చెందిన వినోద్‌కుమార్ 800 మీటర్ల పరుగులో కాంస్యం, గచ్చిబౌలి అకాడమీకి చెందిన మోహిత్‌చౌదరి 3000 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు సాధించారు. వారిని రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో సత్కరించి నగదు బహూకరించారు. అనంతరం వివిధ విభాగాల్లో గెలుపొందిన అథ్లెట్లకు అతిథులు వ్యక్తిగత మెడల్స్ అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి సారంగపాణి, నిర్వహణ కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, కోచ్‌లు శ్రీమాన్, నాగరాజు, పీడీలు సాంబమూర్తి, మహేందర్, కృష్ణ, రజినీకాంత్, వివిధ జిల్లాల ప్రతినిధులు పాల్గొన్నారు.



తుపాకీ పేల్చి అండర్-20 బాలుర 800 మీటర్ల పరుగు ప్రారంభిస్తున్న రవీందర్‌రెడ్డి

చికెన్ ధరలు

ఫాంరేటు	114–00
రిటైల్	136–00
డ్రెస్డ్	197–00
స్కిన్‌లెస్	224–00

ప్రకృతి ప్రేమికులు.. వ్యవసాయ శ్రామికులు

ప్రకృతి సాగు చేస్తూ, పంట మార్పిడి విధానంతో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. పండించిన పంటలను ఇతర రాష్ట్రాలకు పంపిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు నడిగూడెం మండలానికి చెందిన నాగిరెడ్డి వెంకటరెడ్డి, ఏలేటి వెంకటేశ్వరరెడ్డి, రామారావు. - నడిగూడెం, న్యూస్‌టుడే:

గో ఆధారిత సాగు..

నారాయణపురం గ్రామానికి చెందిన **నాగిరెడ్డి వెంకటరెడ్డి** తనకున్న నాలుగెకరాల్లో ఐదేళ్లుగా ప్రకృతి సాగు చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రేమికుడు సుభాష్ పాలేకర్ వద్ద రెండుసార్లు శిక్షణ పొందారు. రసాయనిక ఎరువులు, పురుగు మందులు ఉపయోగించకుండా గోఆధారిత సాగు చేపట్టారు. వరి, వేరుసెనగ, కంది, పెసర, పసుపు, ఉలవ, ఉల్లి పంటలతో పాటు కూరగాయలు, ఆకుకూరలను సహజసిద్ధంగా పండిస్తున్నారు.



- భూసారం పెంపొందించేందుకు తృణధాన్యాలు సాగు చేస్తున్నారు. విత్తనాభివృద్ధికి దేశీ వరి రకాలను సాగు చేస్తూ, ఇతర రైతులకు విత్తనాలు విక్రయిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. పంటల్లో చీడపీడల నివారణకు జీవామృతం, నీమాస్త్రం, అగ్నిహస్త్రం, దశపర్ణి, వేప కషాయం, బీజామృతం, మట్టి ద్రావణాలు సిద్ధం చేసుకొని భూసారాన్ని పెంపొందించుకుంటున్నారు. ప్రకృతి సాగులో దిగుబడి తక్కువగా ఉన్నా, మార్కెట్‌లో రెట్టింపు ధర లభిస్తుండటంతో గిట్టుబాటు అవుతుందన్నారు.

కషాయాలు తయారు చేసి..

సేంద్రియ సాగుపై ఆసక్తి, మందుల్లేని ఆహారం తీసుకోవాలనే సంకల్పంతో తమకున్న ఎకరం విస్తీర్ణంలో సేంద్రియ పద్ధతిలో వరిసాగు చేపట్టారు రత్నవరం గ్రామానికి చెందిన **రామారావు.** గత రెండు సీజన్ల నుంచి సేంద్రియ సాగు చేస్తున్నారు. క్రిమిసంహారక మందు వాడకుండా చీడపీడల నివారణకు కషాయాలు పిచికారీ చేస్తున్నారు. కషాయాలు సైతం తమ క్షేత్రంలో తామే తయారు చేస్తున్నట్లు చెప్పారు. సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన బియ్యాన్నే తాము ఆహారంగా తీసుకుంటున్నామని తెలిపారు. భవిష్యత్‌లో కమతాల సాగు పెంచి సేంద్రియ ఉత్పత్తులను ఇతరులకు సరఫరా చేస్తామన్నారు.



క్రిమి సంహారక మందులు వాడకుండా..

చనుపల్లి గ్రామానికి చెందిన **ఏలేటి వెంకటేశ్వరరెడ్డి** ఐదేళ్లుగా ప్రకృతి సాగు చేస్తున్నారు. తనకున్న నాలుగు ఎకరాల విస్తీర్ణంలో దేశవాళీ వరి వంగడాలను సాగు చేశారు. క్రిమి సంహారక మందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో వరిసాగు చేపట్టారు. పండించిన ధాన్యం మరపట్టించి కోదాడ, హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, జబల్‌పూర్ ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కిలో బియ్యం రూ.110లు, 25 కిలోల బస్తా 2,600 వరకు విక్రయిస్తున్నట్లు వివరించారు.



ఎక్కటి శిల్పం గుర్తింపు

గుండాల, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామ శివుని బండపై పొడవైన జడతో ఉన్న వీరుడి శిల్పాన్ని గుర్తించినట్లు డిస్కవరీ మ్యాన్ రెడ్డి రత్నాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. వెల్మజాల వద్ద ఉన్న వీరుడి శిల్పం భుజాలకు దండ కడియాలు, నడుముకి కత్తి, కాళ్లకు కడియాలు ధరించి, గోచి కట్టి ఉండి, ఛాతి భాగంలో ఏ ఆచ్ఛాదన లేదని వివరించారు. ఎడమ చేతితో విల్లు పట్టుకుని, కుడిచేతితో బాణం సంధిస్తున్నట్లు శిల్పం ఉందన్నారు. కత్తి, విల్లు మొదలైన ఆయుధాలతో పోరాడే వీరులను 'ఎక్కటి' అని పిలుస్తారని తెలిపారు. శిల్పంలోని వీరుడి ముఖ ముందు భాగం, బాణం మధ్యలో తెలుగులో రెండు వరుసల్లో రాసిన శాసనం ఉందని చెప్పారు. భారత పురావస్తు శాఖ ఎపిగ్రాఫిస్ట్‌కు సమాచారం ఇవ్వడంతో కొంత సమాచారం తెలిసిందని. వీరుడు 13వ శతాబ్దానికి చెందిన వాడని, కలబడు వంటి పదాలు ఉన్నాయని, దీని ద్వారా అప్పట్లో జరిగిన యుద్ధంలో కలబడినట్లుగా తెలుస్తోందని వివరించారు. ఇలాంటి శిల్పాలను వీరగల్లు అంటారని వెల్లడించారు. రాష్ట్ర కూట పాలకుడు సామాన్య శకం 907 రెండో కృష్ణుని కాలం నాటి శాసనం గ్రామంలోని పోచమ్మ గుడి ముందు ఒకటి, పాటిగడ్డ మీద రాష్ట్ర కూటుల కాలం నాటి మరో రెండు భారీ శాసనాలు ఉన్నాయని వివరించారు. పరిశోధనలో మాజీ సర్పంచి సుబ్రహ్మణ్య ప్రసాద్, సుధీర్, వినోద్ కుమార్ సహాయపడ్డారు.



ఎక్కటి శిల్పంలో శాసనాన్ని చూపిస్తున్న పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి

రుణాలు ఇప్పిస్తామని మోసం చేసిన ముఠా అరెస్టు: ఎస్పీ

నల్గొండ నేరవిభాగం, న్యూస్‌టుడే: బ్యాంకు అధికారులమని చెబుతూ, తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పిస్తామని అమాయక రైతులు, వ్యాపారులను మోసం చేస్తున్న ముఠాలో ఏడుగురిని అరెస్టు చేయగా, ఒకరు పరారీలో ఉన్నట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు.

◆ నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఇప్పటి వరకు రూ.26 లక్షలు వసూళ్లు చేసుకున్న వీరి నుంచి రూ.1.20 లక్షల నగదు, రైతుల పాసుపుస్తకాలు, అగ్రిమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.



నల్గొండ: వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

◆ పెద్దవూర మండలం వెలుగు గూడెం గ్రామానికి చెందిన కట్టేబోయిన పరమేశ్(42), మిర్యాలగూడ మండలం వెంకటాద్రిపాలేనికి చెందిన మమ్ముల జ్యోతి స్వరూప్(34), నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం గ్రామానికి చెందిన షేక్ వజీర్ (40) (ప్రస్తుతం పరారీ), మాడ్గులపల్లి మండల కేంద్రానికి చెందిన కొండా శ్రీను (40), మిర్యాలగూడ బాలాజీ నగర్‌కు చెందిన గోగుల సురేశ్ (28), మిర్యాలగూడ మండల పరిధిలోని జప్తి వీరప్పగూడెం గ్రామానికి చెందిన చిలుముల సైదులు (35), పెద్దవూర మండలం తెప్పలమడుగు గ్రామానికి చెందిన పల్లేబోయిన నాగరాజు(32), నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన ముప్పిడి సైదులు (35) ఓ ముఠాగా ఏర్పడ్డారు.

◆ బ్యాంకు అధికారులు, ఫీల్డ్ ఆఫీసర్లు, రుణాలు ఇప్పించే వారిగా కొద్ది రోజుల నుంచి జిల్లాలో ఏడు మండలాలకు చెందిన 28 మంది రైతుల నుంచి రూ.26 లక్షల వరకు వసూళ్లు చేశారు. బాధితుల ఫిర్యాదుతో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా వాస్తవాలు అంగీకరించారు. దీంతో వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు, సాగర్ సీఐ బీసన్న, పెద్దవూర ఎస్సై వీరబాబు పాల్గొన్నారు.

ఇద్దరికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష

ఆలేరు, న్యూస్‌టుడే: మారణాయుధాలు కలిగి ఉండి పోలీసులకు పట్టుబడిన కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు, జరిమానా విధిస్తూ భువనగిరి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి తీర్పునిచ్చారని ఆలేరు ఎస్సై పి.రజనీకర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లా కొత్త పాల్వంచకు చెందిన వనపాకుల రాంబాబు అలియాస్ ఆజాద్ అలియాస్ ఈశ్వర్(35), వరంగల్ జిల్లా కేసముద్రం మండలం మహమూద్‌పట్టణానికి చెందిన పిట్టల శ్రీనివాస్ అలియాస్ రాము(38) తుపాకీ(పిస్టల్)తో ఇతరులను బెదిరిస్తూ డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నారు. 2011లో ఆలేరు శివారులో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టిన క్రమంలో పట్టుబడ్డారు. ఇద్దరి నుంచి రెండు పిస్టళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కేసు విచారణ అనంతరం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ఇద్దరు నిందితులను దోషులుగా నిర్ధారించారు. ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.సత్యనారాయణ ప్రాసిక్యూషన్ తరపున వాదించారు. కోర్టు కానిస్టేబుల్ డి.స్వామి కేసు ట్రయల్ నడిపించారు.

గంజాయి పట్టివేత!

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా వద్ద కారులో అక్రమంగా తరలిస్తున్న గంజాయిని రాచకొండ ఎస్వోటీ పోలీసులు పక్కా సమాచారం మేరకు సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని నాసిక్‌కు గంజాయిని తరలిస్తున్నట్టు తెలిసింది. గంజాయి తరలిస్తూ పోలీసులకు చిక్కిన నిందితులు మహారాష్ట్రకు చెందిన వారే. సుమారు 54 కిలోల గంజాయిని కొనుగోలు చేసి కారు సీట్ల కింద దాచి రహస్యంగా తరలిస్తున్న సమాచారం పోలీసులకు అందింది. ఎస్వోటీ పోలీసులు పంతంగి టోల్‌ప్లాజా వద్ద కాపు కాసి గంజాయిని, నిందితులను పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. చౌటుప్పల్ పోలీసులు నిందితుల నుంచి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. గంజాయి కేసు వివరాలను మంగళవారం వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

కోదాడ

●కోదాడ ●హుజూర్‌నగర్

శ్రీరామ మందిరానికి నూతన ఈవో

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: మేళ్లచెరువులోని శ్రీరామ మందిర నూతన కార్యనిర్వహణ అధికారిగా నాగెండ్ల శంభిరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు కోదాడ మండలం అనంతగిరి ఆలయ జూనియరు అసిస్టెంటుగా శంభిరెడ్డి విధులు నిర్వహించారు. తాజాగా పదోన్నతితో శ్రీరామ మందిర ఈవోగా బాధ్యతలు అప్పగిస్తూ దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులిచ్చారు. ఈ మేరకు మందిర ఇన్‌ఛార్జి ఈవో గుజ్జుల కొండారెడ్డి నుంచి బాధ్యతల్ని స్వీకరించినట్టు శంభిరెడ్డి తెలిపారు.



కొండారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరిస్తున్న శంభిరెడ్డి

27న మహా రుద్రాభిషేకం

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: లోకకల్యాణార్థం ఈనెల 27న హుజూర్‌నగర్ ఎన్‌ఎస్‌పీ క్యాంపులో ఏర్పాటు చేసిన ... మహారుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నాగేశ్వరరావు, సుధాకర్ తెలిపారు. నేరేడుచర్లలో సోమవారం మహారుద్రాభిషేకం గోడపత్రికలను విడుదల చేసి మాట్లాడారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని మాతానగర్‌లో రహదారి గుంతలమయంగా మారింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. – రహీమ్, కోదాడ

✔ రహదారులను పరిశీలించి గుంతలు పూడ్చివేస్తాం. – రమాదేవి, పుర కమిషనర్, కోదాడ

వరద బాధితులకు విరాళాలు

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం తెలంగాణ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో డీసీసీబీ ఛైర్మన్ కుంభం శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పద్మావతిని హైదరాబాద్‌లో సోమవారం కలిసి నియోజకవర్గంలోని అన్ని సహకార సంఘాల వారు విరాళాలను చెక్కుల రూపంలో అందించారు. ప్రతి సంఘం నుంచి రూ.10 వేల చొప్పున అందించారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరక్టర్ కొండా సైదయ్య, కోదాడ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, చిమిర్యాల ఛైర్మన్ రఘుపతి, కాపుగల్లు ఛైర్మన్ సూర్యం, యర్రవరం ఛైర్మన్ శ్రీనివాసరావు, బేతవోలు ఛైర్మన్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పద్మావతికి విరాళాలు అందజేస్తున్న సహకార సంఘాల ఛైర్మన్లు

ఎత్తు వేస్తే.. ప్రత్యర్థులు చిత్తే

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: అటు చదువులో.. ఇటు క్రీడల్లో రాణిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. తమకు ఇష్టమైన చెస్‌లో చిన్ననాటి నుంచే శిక్షణ పొంది దూసుకుపోతున్నారు. పోటీలు ఎక్కడ జరిగినా పతకాలు సాధించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు. ఆటలో వీరు ఎత్తు వేస్తే ప్రత్యర్థులు చిత్తు కావాల్సిందే. సెప్టెంబరు 29న హుజూర్‌నగర్ పట్టణంలో జరిగిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి చదరంగం పోటీల్లో కోదాడకు చెందిన యోగిత, అనంతలక్ష్మి వివిధ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి బహుమతులు సాధించారు.



చెస్ ఆడుతున్న విద్యార్థులు

గ్రాండ్ మాస్టర్ కావాలని: యోగిత



మా పాఠశాలలో విద్యార్థులకు చెస్ శిక్షణ ఇస్తున్నారు. వారిని చూసి నాకు కూడా మక్కువ పెరిగింది. దీంతో చెస్‌లో రాణించాలనే కోరికతో మా పాఠశాలలోని కోచ్ వద్ద శిక్షణ పొందాను. 2023లో నల్గొండలో జరిగిన ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి అండర్-11 పోటీల్లో పాల్గొని ప్రథమ బహుమతి సాధించా. హుజూర్‌నగర్‌లో అండర్-11 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచా. భవిష్యత్తులో గ్రాండ్ మాస్టర్ కావాలనేది కోరిక.

అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలని: అనంతలక్ష్మి



చిన్ననాటి నుంచే చెస్ నేర్చుకున్నా. ఇప్పటి వరకు నాలుగు సార్లు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో బహుమతులు, ప్రశంస పత్రాలు అందుకున్నాను. ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయి అండర్-11 విభాగంలో ప్రథమ బహుమతి సాధించాను. 2024 జూన్‌లో అండర్-13 విభాగంలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి, 2023లో అండర్-15 విభాగంలో ఉమ్మడి నల్గొండ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యా. అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకోవాలనేది నా కోరిక.

కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: సీతారాం ఏచూరి మరణం కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ, తెరాసకేవీ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఏచూరి చిత్రపటానికి నివాళులు అర్పించారు. తెరాసకేవీ నియోజకవర్గ అధ్యక్షుడు ఉపేందర్, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు గురవయ్య, నాయకులు రాము, సైదులు, నివాళి అర్పించారు.



హుజూర్‌నగర్: సీతారాం ఏచూరికి నివాళులు అర్పిస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు

ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో మంచి లాభాలు

నడిగూడెం, న్యూస్‌టుడే: కేవీకే గడ్డిపల్లిలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొందుతున్న రైతులు అయిదో రోజు సోమవారం నడిగూడెం మండలం సిరిపురం వద్ద సమీకృత సాగు చేస్తున్న శేషుకుమార్ వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. 1.5 ఎకరాల్లో ప్రకృతి పద్ధతిలో వ్యవసాయ ఉద్యాన పంటలు, గొర్రెలు, గడ్డిజాతి పంటలు, పండ్ల తోటల సాగుతో సమగ్ర ప్రకృతి వ్యవసాయ విధానాలను పాటించి ఎలా ఆదాయాన్ని పొందుతున్నారో శాస్త్రవేత్తలు కిరణ్, నరేశ్‌లు వివరించారు. జీవామృతం, ఘన జీవామృతం, వర్మికంపోస్ట్, వేస్ట్ డీకంపోజర్ తయారు చేసుకునే విధానం గురించి రైతులకు వివరించారు. అభ్యుదయ రైతు తన అనుభవాలను శిక్షణ రైతులకు వివరించారు. ఏఈవో రేణుక, ప్రకృతి రైతు సమన్వయకర్త ఎం.గోపయ్య, రైతులు పాల్గొన్నారు.



ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

నాడు వెలవెల.. నేడు కళకళ!



వానాకాలం ప్రారంభంలో నీరు లేక వెలవెలబోతున్న కందిబండ చెరువు


మేళ్లచెరువు మండలం కందిబండ గ్రామ ఊర చెరువు ఇది. ఈ చెరువు విస్తీర్ణం 48 ఎకరాలు. దీనికింద దాదాపు 500 ఎకరాలు ఉన్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభ దశలో చెరువులకు సాగర్ నీరు వదిలినప్పటికీ.. ఈ చెరువులోకి చుక్కనీరు రాలేదు. వానలూ కురవక ఇందులో నీటి చుక్క కరవైంది. చెరువు కింద ఆయకట్టు రైతులూ అయోమయంలో పడ్డారు. ఈ మధ్యనే భారీ వర్షాలకు వరదలొచ్చాయి. కాల్వ నీరూ అందింది. కేవలం రెండు మూడ్రోజుల్లోనే ఈ నీటితోనే చెరువు నిండి జలకళ సంతరించుకుంది. ఆయకట్టుకూ సంపూర్ణంగా నీరందివ్వగలుగుతోంది. రైతుల్లోనూ సంతోషాన్ని నింపుతోంది.

- మేళ్లచెరువు, న్యూస్‌టుడే



ప్రస్తుతం నీటితో ఇలా..

అమ్మరూపం.. ఆనందభరితం



కోదాడ: మంగళగౌరీ అలంకరణలో...



కోదాడ: నయానగర్‌లో మహాచండీయాగంలో భక్తులు



గరిడేపల్లి: కీతవారిగూడెంలో కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు నిర్వహించారు. కోదాడలోని నయానగర్‌లో వేద పండితుడు వాసుశర్మ ఆధ్వర్యంలో మహాచండీయాగం నిర్వహించారు. అమ్మవారి నవరాత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని మునగాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. నారాయణగూడెంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్నదానం ప్రారంభించారు.

– న్యూస్‌టుడే బృందం



మునగాల: పూజల్లో పాల్గొన్న సీఐ రామకృష్ణారెడ్డి



నేరేడుచర్ల: విజయదుర్గ ఆలయంలో...



నారాయణపురంలో మహాచండీ అవతారంలో అమ్మవారు

జ్ఞాపకాలు గుర్తు చేసుకొని..!

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: లింగగిరి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2007-08 విద్యా సంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులు ఆనాటి గురువులతో కలిసి జ్ఞాపకాలు నెమరు వేసుకొని ఆనందంగా గడిపారు. అనంతరం గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. నాటి గురువులు శ్రీనివాస్‌రెడ్డి, రాఘవరెడ్డి, శ్రీను, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

విలువ ఆధారిత ఉత్పత్తులతో మహిళలకు ఆదాయం

గరిడేపల్లి, న్యూస్‌టుడే: విలువ ఆధారిత ఉత్పత్తులతో మహిళలు ఇంటి వద్దే ఉండి ఆదాయం పొందవచ్చని కేవీకే గృహ విజ్ఞాన శాస్త్రవేత్త ఎన్.సుగంధి సూచించారు. గడ్డిపల్లి కేవీకేలో విలువ ఆధారిత ఉత్పత్తులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. చిరుధాన్యాల పోషక విలువలను గుర్తించి నేడు ఎక్కువ మంది అవే పదార్థాలను ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు, తదితర చిరుధాన్యాలతో అనేక ఉత్పత్తులు తయారుచేయవచ్చని సూచించారు. స్వయం ఉపాధి పొందడానికి ఇప్పుడు మంచి అవకాశమని ఉద్యాన విభాగ శాస్త్రవేత్త సీహెచ్.నరేష్, డి.ఆదర్శ్ పేర్కొన్నారు.



చిరుధాన్యాలతో వివిధ రకాల పిండి వంటలు తయారుచేసి చూపిస్తున్న శాస్త్రవేత్త సుగంధి

డీజేల నిషేధాన్ని ఎత్తివేయాలని నిరసన

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: కోదాడ, హుజూర్‌నగర్, పాలేరు నియోజకవర్గాలలోని డీజే యజమానులు సోమవారం కోదాడలో శాంతియుత నిరసన ర్యాలీ చేపట్టారు. కోదాడ డివిజన్ అధ్యక్షుడు లింగస్వామి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్రంలో డీజేలు నిషేధించడంపై ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో నిషేధించడాన్ని ఖండిస్తూ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి వినతి పత్రం అందజేయడానికి వెళుతుండగా కోదాడ పోలీసులు అడ్డుకోవడం బాధాకరమన్నారు. పొట్టకూటి కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి వెళ్లి డిజేలు పెట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ప్రభుత్వం స్పందించి నిషేధాన్ని ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఓంశ్రీను, ఉపాధ్యక్షుడు వజీర్, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న డీజే యజమానులు, సభ్యులు

కౌజులకు చిరునామా చెన్నకేశవాపురం

నడిగూడెం, న్యూస్‌టుడే: కౌజు గుడ్లు, పిల్లల తయారీ, మాంసం కోసం పిట్టలను ఇతర రాష్ట్రాలకు సైతం ఎగుమతి చేస్తున్నారు. మండలంలోని చెన్నకేశవాపురం కేంద్రంగా నరేంద్ర కుమార్ కౌజుల పెంపకంపై ఆసక్తితో చెన్నకేశవాపురంలో ఫామ్‌ను నిర్వహిస్తున్నారు. బ్రూడింగ్ ద్వారా గుడ్ల నుంచి కౌజు పిల్లలను తయారు చేసి పెంచుకునేందుకు విక్రయిస్తున్నారు. ఖమ్మం, విజయవాడ, మిర్యాలగూడ, హైదరాబాదుకు ఎగుమతి చేస్తున్నట్లు ఆయన చెప్పారు.



బ్రూడింగ్ ద్వారా సిద్ధమైన కౌజు పిల్లలు

విస్తీర్ణం ప్రకారం కొనుగోలు కేంద్రాలు తెరవాలి

మోతె, న్యూస్‌టుడే: మండల పరిధిలోని గ్రామాల్లో వరి సాగు విస్తీర్ణం ప్రకారం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు పూర్తి చేయాలని తహసీల్దార్ సంఘమిత్ర అన్నారు. తహసీల్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ, ఐకేపీ, ప్యాక్స్, సమభావన సంఘాల సభ్యులకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. ఈసారి సన్న, దొడ్డు రకాలకు వేర్వేరుగా కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. దసరా తర్వాత నిర్దేశిత గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాల్సి ఉంటుందన్నారు.

చిలుకూరు: మండలంలో వరికోతలు వచ్చే సరికే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని తహసీల్దారు ధృవకుమార్ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలపై వ్యవసాయ, రెవెన్యూ, మండల సమాఖ్య అధికారులతో సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. కొండాపురం, చిలుకూరు గ్రామాలలో ఐకేపీల ఆధ్వర్యంలో, నారాయణపురం(పాలెఅన్నారం), బేతవోలులో ప్రాథమిక వ్యవసాయ సహకార(ప్యాక్స్) సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. నాయబ్ తహసీల్దారు కరుణశ్రీ, ఆర్‌ఐలు సీతయ్య, శ్వేత, ఏవో శ్రీధర్, ఏఈవోలు చంద్రశేఖర్, శిరీష, మండల సమాఖ్య ఏపీఎం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

మునగాల: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. తహసీల్ కార్యాలయంలో ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌తో కలిసి ఐకేపీ, పీఏసీఎస్ సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు.



మునగాల: సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయులు

పాఠశాల మైదానానికి సీసీ యోగం

స్పందనకు వందనం

మఠంపల్లి, న్యూస్‌టుడే: వర్షపు నీరు తరచూ మఠంపల్లి ప్రాథమిక పాఠశాల మైదానంలోకి చేరి నెలల తరబడి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులపై ఇటీవల ఈనాడులో 'వానొస్తే వరద.. నిలుస్తున్న బురద' శీర్షికతో వెలువడిన కథనానికి సాగర్ సిమెంట్స్ యాజమాన్యం స్పందించింది. స్థానికులు ఆదూరి కిషోర్‌రెడ్డి తదితరులు ఈ విషయాన్ని పరిశ్రమ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లడంతో బడి ప్రాంగణాన్ని సీఎస్ఆర్ నిధులు రూ.3.30లక్షలతో కంకర పరిచి పూర్తిగా సీసీ చేశారు. దశాబ్దాలుగా నెలకొన్న సమస్యకు పరిష్కారం చూపిన కర్మాగారం యాజమాన్యానికి కిషోర్‌రెడ్డి, ఎంఈవో వెంకటాచారి, ప్రధానోపాధ్యాయుడు కిరీటం కృతజ్ఞతలు తెలిపారు.

పోయిన ఫోన్లు దొరుకుతున్నాయ్..!

గరిడేపల్లి, న్యూస్‌టుడే: చరవాణులు పోయినా పలు సాంకేతిక పద్ధతులు ఉపయోగించి వాటిని కనుగొంటున్నారు పోలీసులు. ఇటీవల పలు గ్రామాలలో సెల్‌ఫోన్‌లు పోయాయని పోలీసులకు ఫిర్యాదులందుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఎస్సై చలిగంటి నరేష్ ప్రత్యేక దృష్టి సారించారు. ఫోన్ పోయిన వెంటనే ఫిర్యాదు చేస్తే గుర్తించడానికి వీలుంటుందని చెప్పడంతో రెండు, మూడు నెలల క్రితం పోయిన బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. రెండు రోజుల క్రితమే గడ్డిపల్లికి చెందిన వ్యక్తి ఫోన్ కనిపెట్టి అప్పగించారు. తాజాగా కల్మల్‌చెరువు గ్రామానికి చెందిన అనంతు ప్రమీల, తడకమల్ల ప్రవీణ్, కాల్వపల్లికి చెందిన ఆశీర్వాదం తమ ఫోన్‌లు రెండు నెలల క్రితం పోయినట్లు స్టేషన్‌లో దరఖాస్తు ఇచ్చారు. వెంటనే సంబంధిత యాప్‌తో గుర్తించి ముగ్గురికి ఫోన్‌లు అప్పగించారు. వారం రోజుల్లోనే ఐదు మొబైల్స్ ఇవ్వడంతో బాధితులు ఆనందం వ్యక్తం చేశారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు దగ్ధం

నడిగూడెం, న్యూస్‌టుడే: నడిగూడెం మండలం రామాపురంలో ఆదివారం రాత్రి వీచిన గాలిదుమారం, ఉరుములు మెరుపులకు పిడుగు పడి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. శేఖర్‌రెడ్డి ఇంటి ప్రహరీ పక్కనే ఉన్న 11కేవీ విద్యుత్తు తీగలపై పిడుగు పడింది. 15 సీలింగ్ ఫ్యాన్‌లు, కేబుల్ టీవీకి సంబంధించిన సెటప్ బాక్స్‌లు, ఇన్వర్టర్లు కాలిపోయినట్లు బాధితులు తెలిపారు. నివాస గృహాల మధ్య నుంచి వెళ్తున్న 11కేవీ విద్యుత్తు లైను తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంక్షిప్త సమాచారం

వాలీబాల్ పోటీలు.. నడిగూడెం: వెంకటేశ్వర్లు యువసేన ఆధ్వర్యంలో శుక్రవారం నడిగూడెంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఫిర్యాదు.. మునగాల: మండల కేంద్రంలోని పలు సమస్యలపై సమాచారం కోరినా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థుడు రాయల కృష్ణ కోరారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి.. మునగాల గ్రామీణం: తాడ్వాయిలో ఎస్బీఐ, ఆర్‌ఎస్‌ఈటీఐ ఆధ్వర్యంలో ఈ నెల 12 నుంచి యువత స్వయం ఉపాధి చేపట్టడానికి శిక్షణ అందిస్తున్నట్లు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శి రాము అన్నారు.

నిరసన.. కోదాడ పట్టణం: అమెరికా దాని మిత్ర దేశాల అండతో పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని కోరుతూ సీపీఐఎంఎల్ న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. అరుణోదయ జిల్లా అధ్యక్షుడు ఉదయగిరి, రైతు కూలీ సంఘం నాయకులు సత్యనారాయణరెడ్డి, రవి, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం.. హుజూర్‌నగర్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తికి నెలకు రూ.1,500 ఇచ్చి ఆదుకోవడం అభినందనీయమని పురపాలక సంఘం వైస్ ఛైర్మన్ సంపత్‌రెడ్డి అన్నారు. పట్టణానికి చెందిన భైరం వెంకన్న అనారోగ్యంతో బాధపడుతున్న పరిస్థితిని కాంగ్రెస్ నాయకులు ఎంజీఎఫ్ సంస్థ దృష్టికి తీసుకుపోవటంతో వారు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. ప్రతినెలా రూ.1,500 ఇచ్చేందుకు రావటమే కాక మొదటి నెల చెక్కును సోమవారం అందజేశారు. ఎంజీఎఫ్ మేనేజర్ నరేష్‌ను సంపత్‌రెడ్డి అభినందించారు.

పరామర్శ.. చిలుకూరు: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మండల కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతిలను సోమవారం కలిసి పరామర్శించారు. అనంతరం పురుషోత్తంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఎంపీపీ నాగేంద్రబాబు, నాయకులు కోటయ్య, నాగయ్యగౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

వర్ధంతి.. గరిడేపల్లి: ప్రజా సమస్యలు, పార్టీ జెండాయే జీవితంగా పోరాటం చేసిన యోధుడు మేదరమట్ల సీతారామయ్య అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శేఖర్‌రావు అన్నారు. వెల్దండలో సీతారామయ్య 27వ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. ఆయన సేవలను గుర్తుచేశారు. పల్లా వెంకటరెడ్డి, షేక్.యాకూబ్, సోమయ్య, సైదులు, మట్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, సత్యం సుందరం, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** దేవర, **రంగా:** శ్వాగ్, **వెంకటేశ్వర:** రామ్‌నగర్ బన్నీ

సూర్యాపేట

● సూర్యాపేట ● తుంగతుర్తి

కళాకారుల ఆటాపాట


అవగాహన కల్పిస్తున్న సారథి కళాకారులు

జాజిరెడ్డిగూడెం: పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో నాణ్యతండాలో సోమవారం కళా ప్రదర్శనలు నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, ప్రకృతి తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సారథి జిల్లా అధ్యక్షుడు వెన్నెల నాగరాజు, శంకర్, ఉదయ్, మేడిపల్లి వేణు, శ్రీకాంత్, శిరీష, మంజుల, ఉపేందర్, రాధ, స్రవంతి పాల్గొన్నారు.

సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:

? సూర్యాపేట పట్టణంలోని గోపాలపురంలో కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వాహనదారులపై ఎగబడి దాడులు చేస్తుండటంతో అదుపు తప్పి కిందపడుతున్నారు. –రవి, గోపాలపురం

✔ కుక్కలను పట్టించి సంరక్షణ కేంద్రానికి తరలిస్తాం. –శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM) సూర్యాపేట: 9154395978 తుంగతుర్తి: 80085 74450

భానుపురి, న్యూస్‌టుడే:

? సూర్యాపేట పురపాలిక పరిధిలోని దురాజ్‌పల్లిలో మిర్యాలగూడకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారింది. వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. –రాజు, సూర్యాపేట

✔ గుంతలు పూడ్చి ఇబ్బందులు లేకుండా చూస్తాం. –యుగేందర్, ఆర్‌అండ్‌బీ ఏఈ, సూర్యాపేట

నేలకొరిగిన వరిపొలాలు

జాజిరెడ్డిగూడెం మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి వరి పొలాలు నేలకొరగడంతో రైతులకు తీరని నష్టం మిగిలింది. మండలంలోని పడమటితండా, అర్వపల్లి, బొల్లంపల్లి, జాజిరెడ్డిగూడెం, తిమ్మాపురం, కొమ్మాల తదితర గ్రామాల్లో చేతికొచ్చిన వరి నేలవాలింది. పది నుంచి 15 రోజుల లోపు కోతకు వచ్చే దశలో నేలవాలడంతో వడ్లు రాలిపోయాయి. పడమటితండాలోనే సుమారు వందెకరాల్లో పొలం అడ్డంపడిందని రైతులు భోరున విలపిస్తున్నారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


అర్వపల్లిలో అడ్డంపడిన వరిపొలాన్ని చూపిస్తున్న రైతు ఆంగోతు కిషన్

–జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే:

మృత్యుపాశాలు.. వేలాడే తీగలు


పెన్‌పహాడ్: గాజులమొల్కాపురం శివారులో సమ్మక్క - సారలమ్మ దేవాలయ సమీపంలో కిందికి జారిన విద్యుత్తు తీగలు


నూర్జహాన్‌పేట వద్ద పొలంలో కరెంటు తీగలు ఇలా..

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: సూర్యాపేట నియోజకవర్గంలోని పలు గ్రామాల వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్తు తీగలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కొన్నిచోట్ల చేతికందే ఎత్తులో కిందకు వేలాడుతుండటంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. వర్షం, గాలి దుమారాలకు తీగలు తెగిపడిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మేతకు వెళ్లిన పశువులు తెగిపడిన తీగను తాకి విద్యుదాఘాతానికి మృత్యువాత పడుతున్నాయి. ఫలితంగా పాడి రైతులకు ఆర్థిక నష్టం వాటిల్లి జీవనోపాధి కోల్పోతున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న విద్యుత్తు తీగలను వెంటనే సరిచేసి ప్రమాదాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

వదులు తీగలను సరిచేస్తాం

–రమేశ్, డీస్కం ఏఈ, పెన్‌పహాడ్

గ్రామాల్లో ప్రస్తుతం వానాకాలం సీజన్ పనులు జరుగుతున్నాయి. ఆ పనులు ముగిసిన తర్వాత వ్యవసాయ క్షేత్రాలను పరిశీలిస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వదులు తీగలను సరిచేస్తాం.

ప్రమాదకరంగా మెలికపడి

పెన్‌పహాడ్: మండలంలోని గాజులమొల్కాపురం శివారులోని సమ్మక్క - సారలమ్మ దేవాలయం సమీపంలో, నూర్జహాన్‌పేట, అనిరెడ్డిగూడెం, మాచారం తదితర గ్రామాల సమీపంలోని వరి పొలాల్లో విద్యుత్తు తీగలు ప్రాణాంతకంగా ఉన్నాయి. పొలంలోకి వెళ్లే రైతుల తలకు తాకే విధంగా వేలాడుతున్నాయి. దీంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడుతోంది. కాలం చెల్లిన కరెంటు తీగలు సాగిపోయి తెగిపడే పరిస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురు గాలుల కారణంగా మెలికపడి మంటలు లేస్తున్నాయని వాపోతున్నారు. వర్షాకాలంలో విద్యుత్తు ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో వ్యవసాయ పనులకు వెళ్లలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో కొన్ని గ్రామాలు, తండాల్లో విద్యుదాఘాతంతో పశువులు మృతిచెందిన ఘటనలున్నాయి. ప్రమాదాలు చోటుచేసుకోకుండా వదులు తీగలను సరిచేయాలని రైతులు కోరుతున్నారు.

భయపడుతూ వ్యవసాయ పనులు

చివ్వెంల: మండలంలోని పాచ్యానాయక్‌తండా, పాండ్యానాయక్ తండా, తిరుమలగిరి, గుంజలూరు, చందుపట్ల, లక్ష్మీనాయక్‌తండా, వీకేపహాడ్ తదితర గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. రైతులు భయపడుతూ వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు. గతంలో గుంజలూరు, చివ్వెంల గ్రామాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో తీగల తెగిపడి పశువులు మృత్యువాత పడ్డాయి.

కాలిపోతున్న మోటార్లు

ఆత్మకూర్(ఎస్): మండలంలోని నంద్యాలగూడెంలో కృష్ణారెడ్డి వ్యవసాయ బావి వద్ద, బీసు లక్ష్మయ్య వ్యవసాయ క్షేత్రం నుంచి తంగెళ్ల శ్రీనివాస్‌రెడ్డి చెలక వరకు విద్యుత్తు తీగలు కిందికి వేలాడుతున్నాయి. ఈదురుగాలులు వీచినప్పుడు తీగలు మెలిక పడి మోటార్లు కాలిపోతున్నాయని రైతులు తెలిపారు. ఏపూర్‌లో కాణాల నర్సిరెడ్డి, గోపాల్ చేను వద్ద కరెంటు తీగలు వదులుగా ఉన్నాయి. వ్యవసాయ పనులు చేసేటప్పుడు ప్రమాదాలు జరగకుండా కర్రెలతో తీగలను ఎత్తి పట్టుకుంటున్నామని స్థానికులు వాపోయారు.

క్రీడలతో మానసికోల్లాసం

జాజిరెడ్డిగూడెం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని అర్వపల్లి ఎస్సై బాలకృష్ణ అన్నారు. జాజిరెడ్డిగూడెం గ్రామంలో పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో మండల స్థాయి కబడ్డీ క్రీడలను సోమవారం ప్రారంభించి మాట్లాడారు. ఈ ఆటలతో శరీర దృఢత్వంతో పాటు పోటీతత్వం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బింగి కృష్ణమూర్తి, ఎల్లెంల కొమిరెల్లి, చింత నర్సయ్య, అక్కులు, సుతారపు అనిల్, వెంకన్న, వీరయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.


జాజిరెడ్డిగూడెంలో కబడ్డీ క్రీడలను ప్రారంభిస్తున్న ఎస్సై బాలకృష్ణ

నూతన ఇసుక విధానంపై అవగాహన

తిరుమలగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ ఇసుక రవాణా చేయాలని తహసీల్దార్ హరిప్రసాద్ అన్నారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో ట్రాక్టర్ యజమానులకు నూతన ఇసుక విధానంపై అవగాహన కల్పించారు. ట్రాక్టర్ యజమానులు ఆన్‌లైన్ విధానంలో తమ వాహన వివరాలు నమోదు చేసుకొని నిర్ణయించిన సమయంలోపు ఇసుక తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో డీటీ జాన్ మహ్మద్, ఆర్ఐ సుజిత్‌రెడ్డి పాల్గొన్నారు. నాగారం: ప్రభుత్వం నూతనంగా అమలులోకి తేనున్న ఇసుక పన్ను విధానంపై సోమవారం తహసీల్ కార్యాలయంలో వాహన యజమానులకు తహసీల్దార్ బ్రహ్మయ్య అవగాహన కల్పించారు. వాహనదారులు వాహన రిజిస్ట్రేషన్, బ్యాంకు ఖాతా పుస్తకం, ఆధార్‌కార్డు, వాహన బీమా, పొల్యూషన్ పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఎస్ఓ రమేశ్, మహేశ్వరి, ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.


నాగారంలో ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

రహదారి గుంతలమయం.. రాకపోకలకు అంతరాయం

ఇటీవల కురిసిన వర్షానికి మండలంలోని అనాజీపురం గ్రామంలో ప్రధాన వీధి గుంతలమయంగా మారింది. వాహనదారులు, ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. గుంతల్లో వర్షపు నీరు చేరడంతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చేసుకుంటున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. 'గుంతల్లో మొరం పోయించి చదును చేయిస్తామ'ని ఎంపీవో సంజీవయ్య 'న్యూస్‌టుడే'కు చెప్పారు.



–పెన్‌పహాడ్, న్యూస్‌టుడే:

బాటసారులకు బాసటగా జంటమర్రి వృక్షం

మద్దిరాల మండలంలోని కుంటపల్లి గ్రామ శివారులో కుక్కడం గ్రామం వెళ్లే దారిలో రహదారి పక్కన ఉన్న ఈ మర్రిచెట్టు వేసవిలో ఎండ తాపం నుంచి, వానాకాలంలో వానల నుంచి ప్రజలకు ఉపశమనం కలిగిస్తోంది. బాటసారులకు ఎండావాన నుంచి బాసటగా నిలుస్తోంది. ఈ ప్రదేశాన్ని స్థానికులు జంటమర్రి ప్రదేశంగా పిలుస్తుంటారు. ఈ వృక్షం వయస్సు వందేళ్లకు పైగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. –మద్దిరాల గ్రామీణం, న్యూస్‌టుడే:



బూటకపు ఎన్‌కౌంటర్లు దుర్మార్గమైన చర్య: ఐఎఫ్‌టీయూ


సూర్యాపేటలో మాట్లాడుతున్న గంట నాగయ్య

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం పోలీసు యంత్రాంగంతో చేపడుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లను తక్షణమే నిలిపివేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించిన న్యూడెమోక్రసీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మావోయిస్టు పార్టీకి చెందిన 32 మందిని బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆ ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిలతో న్యాయ విచారణ జరిపించాలని కోరారు. సమావేశంలో పోలోబోయిన కిరణ్‌కుమార్, దేశోజు మధు, సామ నర్సిరెడ్డి, బొల్క పవన్, దుర్గయ్య, మందడి శ్రీధర్ పాల్గొన్నారు.

పాలస్తీనాపై దాడులు ఆపాలని నిరసన


కొత్తబస్టాండ్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: అమెరికా సామ్రాజ్యవాదుల అండతో ఇజ్రాయెల్ పాలస్తీనాపై చేపడుతున్న దాడులకు ప్రపంచ శాంతికాములు ముక్తకంఠంతో ఖండించాలని సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శులు, బెజవాడ వెంకటేశ్వర్లు, మల్లు నాగార్జునరెడ్డి, నజీర్, న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి గంట నాగయ్య సంయుక్తంగా పిలుపునిచ్చారు. కొత్తబస్టాండ్ చౌరస్తాలో వామపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఇజ్రాయెల్ దిష్టిబొమ్మ దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. పాలస్తీనాలో శాంతి వాతావరణాన్ని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. అనంతుల మల్లేశ్వరి, ములకలపల్లి రాములు, కంబాల శ్రీను, యాదగిరి, వెంకన్న, ధనుంజయ నాయుడు, కృష్ణారెడ్డి, గోపి, వెంకటేశ్వర్లు, రాము పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం

మద్దిరాల, న్యూస్‌టుడే: ప్రజాసమస్యలపై అలుపెరగని పోరాటం సాగిస్తున్న పార్టీ సీపీఎం అని జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని జి.కొత్తపల్లికి చెందిన పార్టీ నాయకురాలు గుడికందుల సత్యమ్మ ఇటీవల మృతి చెందగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మూరగుండ్ల లక్ష్మయ్య, కోట గోపి, నర్సింగ్ కొమరయ్య పాల్గొన్నారు.

స్లాబ్ శిథిలం.. ప్రమాదాలకు నిలయం

సూర్యాపేట పట్టణంలోని పలు చోట్ల మురుగు కాల్వలపై స్లాబ్ నిర్మించలేదు. నల్లాలబావి రోడ్డు, తాళ్లగడ్డ, కృష్ణానగర్, ఎన్టీఆర్ కాలనీల్లో పెద్ద మురుగు కాల్వలపై స్లాబ్ కూలిపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. ఏమాత్రం ఆదమరిచినా కాల్వలో పడిపోయే అవకాశం ఉంది. కొన్నిచోట్ల కాల్వలు శిథిలావస్థకు చేరినా మరమ్మతు చేపట్టే వారు కరవు. పట్టణంలోని వివిధ భారీ దుకాణాల ముందు కాల్వలు శిథిలావస్థకు చేరి కూలిపోవడంతో దుకాణదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నల్లాలబావి రోడ్డు రాఘవప్లాజా వద్ద స్లాబ్‌లేని మురుగు కాల్వ రహదారికి పక్కనే ఉండటంతో వాహనదారులు, ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. 'పెద్ద కాల్వలను పరిశీలించి స్లాబ్ నిర్మిస్తామ'ని పుర కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు.



–సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే

ధాన్యం కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగొద్దు


తిరుమలగిరి తహసీల్ కార్యాలయంలో మాట్లాడుతున్న తహసీల్దార్ హరిప్రసాద్

తిరుమలగిరి, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని తహసీల్దార్ హరిప్రసాద్ సూచించారు. సోమవారం తహసీల్ కార్యాలయంలో వ్యవసాయ, పోలీస్‌శాఖ, ఐకేపీ అధికారులతో ఐకేపీ కొనుగోలు కేంద్రాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన తరువాత ధాన్యం వివరాల రసీదు ఇవ్వాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించి కొనుగోళ్లు జరపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో వెంకట్‌రెడ్డి, ఎస్సై సురేశ్, ఏపీఎం సైదులు, పాల్గొన్నారు.

నూతనకల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు కోరారు. నూతనకల్ తహసీల్ కార్యాలయంలో శాఖ అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో తహసీల్దారు మాట్లాడారు. నూతనకల్‌లో రెండు వీవోఏలకు అవకాశం కల్పించి సన్నరకం, దొడ్డురకం ధాన్యం కొనుగోలు కేంద్రాలను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, ఎంపీవో శశికళ, ఏపీఎం కరుణాకర్, మండల విద్యాధికారి రాములునాయక్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు యల్లయ్య, ఉదయ్‌కుమార్, పీఏసీఎస్ సీఈవో సంపెట వెంకన్న, ఏపీవో శ్రీరాములు పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: మిషన్ భగీరథ పథకంలోని లోపాలను సరిదిద్ది, నీటి సమస్యను పరిష్కరించాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ కోరారు. ఆ పార్టీ నాయకులతో కలిసి సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ, మిషన్ భగీరథ శాఖల సమన్వయ లోపం కారణంగా పట్టణంలో నీటి కొరత తీవ్రంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు గట్ల రమాశంకర్, బచ్చలకూరి గోపి, చంద్రకాంత్, వినయ్‌గౌడ్, సతీష్, కిశోర్, వంశీ పాల్గొన్నారు.

సూర్యాపేట కలెక్టరేట్: తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల శంకుస్థాపన కార్యక్రమాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ తుంగతుర్తి భారాస నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు తడకమళ్ల రవికుమార్ మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రం, విద్యా, వైద్యం, రవాణా రంగాల్లో వెనుకబాటుకు గురైందని, ఎన్ని ప్రభుత్వాలు మారినా తమ ఇబ్బందులు తొలగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి నియోజకవర్గ కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను ఏర్పాటు చేసేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బొంకూరు మల్లేశ్, కొండగడుపుల వెంకటేశ్, తడకమళ్ల మల్లికార్జున్, చింతకుంట్ల సురేశ్, శ్రీను పాల్గొన్నారు.

భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడి ఎన్నిక

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా ఆత్మకూర్(ఎస్) మండలం కందగట్లకు చెందిన గోగుల శేఖర్‌రెడ్డి గెలుపొందారు. మండలంలోని నెమ్మికల్ గాయత్రి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఆ సమితి జిల్లా అధ్యక్ష ఎన్నిక నిర్వహించారు. జిల్లా మాజీ అధ్యక్షుడు, నల్గొండ జిల్లా ఇన్‌ఛార్జి కుర్ర గోపి యాదవ్‌పై 15 ఓట్ల ఆధిక్యంతో శేఖర్‌రెడ్డి విజయం సాధించారు. అనంతరం ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ ఎన్నిక నియామక పత్రం అందించి అభినందించారు. కార్యక్రమంలో గుర్రం నరేష్‌రెడ్డి, కొండ సైదులుయాదవ్, వీరమ్మ, మంచాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ నుంచి ఎన్నిక నియామక పత్రాన్ని అందుకుంటున్న గోగుల శేఖర్‌రెడ్డి

అదనపు పీపీగా లక్ష్మణ్ బాధ్యతల స్వీకరణ

సూర్యాపేట న్యాయవిభాగం, న్యూస్‌టుడే: సూర్యాపేట అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కె.లక్ష్మణ్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇన్నాళ్లు నాంపల్లి సీఐడీ కోర్టులో సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఈయన పని చేశారు. ఉద్యోగోన్నతిపై సూర్యాపేటకు బదిలీ అయ్యారు. ఈయన గతంలో సూర్యాపేట, నకిరేకల్, నల్గొండలో పనిచేశారు. సూర్యాపేటలో అదనపు పీపీగా బాధ్యతలు నిర్వహించిన అఖిల పదోన్నతిపై నల్గొండకు బదిలీ అయ్యారు. లక్ష్మణ్ సూర్యాపేట అసిస్టెంట్ సెషన్స్ న్యాయస్థానంలో అదనపు పీపీగా సేవలందించనున్నారు. బాధ్యతలు చేపట్టిన లక్ష్మణ్‌ను సూర్యాపేట ఏపీపీలు బి.హేమలత, వై.శ్రీపాల్‌రెడ్డి, ఇతర న్యాయవాదులు అభినందించారు.



ఆయిల్‌పామ్ సాగు లాభదాయకం

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రైతులు ఆయిల్‌పామ్ తోటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం అన్నారు. తిమ్మాపురం గ్రామంలో క్షేత్ర సహాయకుడు ముత్యం రాజుతో కలిసి సోమవారం రైతులకు ఈ పంట ద్వారా వచ్చే లాభాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాల గురించి అవగాహన కల్పించారు. తోటలో అంతరపంట సాగు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో రైతులు యాదగిరి, వెంకన్న, లింగరాజు, జానయ్య, అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఇసుక నిల్వల స్వాధీనం

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని ముక్కుడుదేవులపల్లి గ్రామం పక్కనే గల చిన్నేటి వాగు నుంచి పెద్దఎత్తున ఇసుకను గ్రామ శివారులో ఇటీవల గుర్తుతెలియని వ్యక్తులు నిల్వ చేశారు. ఈ సమాచారం తెలిసిన రెవెన్యూ, పోలీసులు సోమవారం ఇసుక నిల్వలను పరిశీలించారు. ఎంఆర్ఐ ప్రదీప్‌రెడ్డి చుట్టుపక్కల రైతుల నుంచి సమాచారం సేకరించారు. పంచనామా నిర్వహించి పోలీసులు, గ్రామ పంచాయతీ అధికారులకు ఇసుక డంపును అప్పగించారు. అనుమతి లేకుండా ఇసుక నిల్వ చేసిన వ్యక్తులను గుర్తించి చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.


అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపును పరిశీలిస్తున్న పోలీస్, రెవెన్యూ అధికారులు

బోరు మోటార్ నిర్వహణపై శిక్షణ

నూతనకల్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో మంచి నీటి సరఫరాకు ఉపయోగించే బోరు మోటార్ల నిర్వహణపై గ్రామ పంచాయతీ నీటి సహాయక సిబ్బందికి సోమవారం రెండోరోజు నూతనకల్ మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అజయ్, ఎంపీడీవో సునీత, ఎంపీవో శశికళ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు ఉదయ్‌కుమార్, అఖిల్, అశోక్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని పాతసూర్యాపేటకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు సామర్తపు జానయ్య అనారోగ్యంతో ఇటీవల మరణించారు. బాధిత కుటుంబానికి ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో రూ.5 వేలు, టైల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం రూ.3 వేల ఆర్థిక సాయం అందించారు.

వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో..)

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	3062	1665
జైశ్రీరాం	3212	1649
ఐఆర్-64	2061	1773
హెచ్ఎంటీ	3095	2109
కందులు	9392	5796
పెసర	6665	2859
వేరుసెనగ	7619	4059
బొబ్బర్లు	4028	4028
మినుములు	3006	3006
జొన్నలు	3123	3123

రక్షణ మోకుపై గీత కార్మికులకు అవగాహన

నాగారం, న్యూస్‌టుడే: గీత కార్మికులు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రక్షణ మోకులపై అవగాహన పెంచుకోవాలని గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కాపురి శ్రీకాంత్ అన్నారు. గౌడ సంక్షేమ సంఘం, ఎక్సైజ్ శాఖల ఆధ్వర్యంలో సోమవారం గీత కార్మికులకు రక్షణ మోకులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు కళ్యాణి, గీత కార్మికులు బాలగాని మురళి, మొగుళ్ల మహేశ్ పాల్గొన్నారు.

ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు


తిరుమలగిరిలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పట్టణంలోని శ్రీసంతోషిమాత, కన్యకాపరమేశ్వరి, కనకదుర్గాఅమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారు సోమవారం మహాచండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాచండీ హోమం నిర్వహించారు. 28వ వార్డులో మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు సర్వోత్తమ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నూతనకల్: చిల్పకుంట్ల భగత్‌సింగ్ యూత్ ఆధ్వర్యంలో గడ్డమీది బజార్‌లో నిర్వహిస్తున్న వేడుకల్లో మందడి భూపాల్‌రెడ్డి, ఉపేంద్ర దంపతులు అన్నదానం చేశారు.

తిరుమలగిరి: తిరుమలగిరిలో అమ్మవారిని మహాచండీదేవిగా అలంకరించి కుంకుమార్చన పూజలు నిర్వహించారు.


సూర్యాపేట: అన్నప్రసాదం వడ్డిస్తున్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు సర్వోత్తమ్‌రెడ్డి, తదితరులు

మద్దిరాల: మామిండ్లమడవ గ్రామంలో మహాచండీదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం భగత్‌సింగ్ యువజన కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి సన్నిధిలో వేద పండితులు చండీయాగం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నాగారం: వర్ధమానుకోట, ఈటూరు, మాచిరెడ్డిపల్లి, పస్తాల గ్రామాలలో సోమవారం భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అన్నదానం చేశారు.


మామిండ్లమడవలో చండీయాగం నిర్వహిస్తున్న భక్తులు


మాచిరెడ్డిపల్లిలో అన్నదానం చేస్తున్న భక్తులు

స్నేహితుడి కుటుంబానికి చేయూత

తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: వెలుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05లో పదో తరగతి చదివిన షేక్ నవీన్ పాషా ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. అతని మరణంతో ముగ్గురు పిల్లలు పెద్దదిక్కును కోల్పోవడంతో స్నేహితులు తలాకొంత పోగు చేసి సోమవారం కుటుంబ సభ్యులకు రూ.30 వేలు అందజేశారు. కార్యక్రమంలో బొల్లం లింగయ్య, ఏనుగుతల ప్రభాకర్, షేక్ అజ్జు, కర్నె కరుణాకర్, ఉప్పలయ్య, రవీందర్ పాల్గొన్నారు.


వెలుగుపల్లిలో ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

కూలర్ బహూకరణ

తుంగతుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని సివిల్ సప్లై గోదాంలో పని చేసే హమాలీల తాగునీటి కోసం రూ.18 వేల విలువ గల వాటర్ కూలర్‌ను తుంగతుర్తికి చెందిన వందనపు వెంకటేశ్వర్లు అందించారు. తన భార్య పద్మ జ్ఞాపకార్థం కూలర్‌ను అందించారు. హమాలీ సంఘం అధ్యక్షుడు ఎల్లయ్య, శ్యాంసుందర్, రమేష్, నరేష్ పాల్గొన్నారు.